క్లుప్తంగా

పౌష్టికాహారం తీసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న టీబీ సూపర్‌వైజర్ రవికుమార్

ఆత్మకూరు: ప్రతిఒక్కరూ పౌష్టికాహారం తీసుకుంటే వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని టీబీ సూపర్‌వైజర్ రవికుమార్ తెలిపారు. మండలంలోని కొట్టాల చెరువు, గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు బుధవారం క్షయ, తదితర వ్యాధులపై అవగాహన నిర్వహించారు. భోజనంలో పాలు, గుడ్డు, మాంసం, ఆకుకూరలు, కూరగాయలు, దుంపలు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. వారం రోజులుగా జ్వరం, దగ్గు తగ్గకపోతే వెంటనే గల్ల పరీక్ష చేయించుకోవాలన్నారు. క్షయవ్యాధి సోకినట్లు నిర్ధారణ అయితే డాక్టర్ల సూచనల మేరకు క్రమం తప్పకుండా మందులు వాడి నయం చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అంబమ్మ, హెల్త్ అసిస్టెంట్ సామక్క పాల్గొన్నారు.

విశేష పూజలు



సాక్షి గణపతి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలో లోక కల్యాణార్థమై బుధవారం సాయంత్రం సాక్షిగణపతి స్వామికి అభిషేకం, ఆలయ ప్రాంగణంలోని జ్వాలా వీరభద్ర స్వామికి విశేషపూజలు నిర్వహించారు. సాక్షి గణపతి స్వామికి పంచామృతాలతోను, ఫలోదకాలతోను, హరిద్రోదకం, గంధోదకం, పుష్పోదకం, కలశోదకం, శుద్ధ జలంతో అభిషేకం చేసి విశేష పుష్పార్చన, నివేదన కార్యక్రమాలను చేపట్టారు. అలాగే జ్వాలా వీరభద్రస్వామివారికి అభిషేకం, విశేషపుష్పార్చన జరిపించారు.

కుమారస్వామికి షష్టి పూజలు



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో బుధవారం షష్టిని పురస్కరించుకుని ఆలయ అధికారులు, అర్చకులు విశేష క్రతువులు నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకం, సుబ్రహ్మణ్య, అష్టోత్తరం అనంతరం స్తోత్రపారాయణలు చేశారు. సుబ్రహ్మణ్యస్వామి అభిషేకంలో స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో మౌలాలిస్వామి జార్తలు



పూజలందుకున్న మౌలాలిస్వామి

మహానంది: బుక్కాపురంలో మౌలాలిస్వామి జార్తలు బుధవారం రాత్రి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామస్తులు మఖానం వద్దకు చేరుకుని మౌలాలిస్వామిని దర్శించుకున్నారు. బాసికాలు, పూలదట్టీలు, చక్కెర చదివించి మొక్కులు చెల్లించుకున్నారు.


అలరించిన నృత్య ప్రదర్శన



నృత్యప్రదర్శనలో కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్య కళావేదికపై నందికొట్కూర్‌కు చెందిన నృత్యకళాశాల సంప్రదాయ నృత్యప్రదర్శన అలరించింది. మహాగణపతిం, మూషికవాహన, హరహరశంభో, నమో నమో టనరాజ, శ్రీశైలగిరి వాసా తదితర గీతాలకు సహస్ర, దీక్షిత, మాధురి, హర్షిణి, శిరీష తదితరులు నృత్య ప్రదర్శన చేశారు.

ఎరువుల పంపిణీ



రైతులకు ఎరువులు పంపిణీ చేస్తున్న సొసైటీ సిబ్బంది

జూపాడుబంగ్లా: మండల కేంద్రంలోని 80బన్నూరు సహకార సొసైటీలో రైతులకు గురువారం ఎరువుల పంపిణీ చేశారు. సొసైటీకి 12 టన్నుల క్రిబ్‌కో, ఇఫ్‌కో డీఏపీ, 24 టన్నుల స్పిక్, క్రిబ్‌కో యూరియా, 12 టన్నుల క్రిబ్‌కో కంపెనీ 10.26.26 ఎరువులు మంజూరైనట్లు సొసైటీ సీఈఓ చంద్రశేఖర్‌గౌడ్ తెలిపారు. యూరియా కొరత నెలకొన్నందున ఐదు ఎకరాల్లోపు పొలం ఉన్న రైతుకు ఎకరాకు ఒకటి చొప్పున, ఐదు ఎకరాలు పైబడి పొలం ఉన్న రైతులకు ఐదు సంచుల యూరియా ఇస్తున్నట్లు తెలిపారు.

పొంచివున్న ప్రమాదం!



ఆరోగ్య ఉపకేంద్రం సమీపంలో శిథిలమై కడ్డీలు తేలిన విద్యుత్‌స్తంభం

జూపాడుబంగ్లా మండలం 80 బన్నూరు గ్రామస్తులు ప్రమాదాన్ని పక్కనే పెట్టుకుని జీవనం సాగిస్తున్నారు. గ్రామంలోని బొద్రాయి సందు, ఓసీ కాలనీల్లో 1994 మార్చి 22న విద్యుత్‌స్తంభాలు ఏర్పాటుచేశారు. దాదాపు 30 ఏళ్లు గడిచిపోవడంతో ఎండకు ఎండి, వానకు తడిసి స్తంభాలు శిథిలమై కడ్డీలు తేలి ప్రమాదకరంగా ఉన్నాయి. ఎప్పుడు కూలుతాయో తెలియని దుస్థితి. ఇక వర్షాకాలంలో తడికి చుట్టుపక్కలా విద్యుత్ ప్రవహించే ప్రమాదం లేకపోలేదు. సమస్యను కాలనీవాసులు విద్యుత్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా వారికి చెవికెక్కకపోవడంతో చేసేదేమీ లేక ప్రమాదం మధ్యనే జీవనం సాగిస్తున్నారు. ప్రజల ప్రాణాలు పోతే తప్ప విద్యుత్ అధికారులు స్పందించేలా లేరని, తమ ప్రాణాలంటే వారికి విలువేలేదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీ వాసులు చెప్పినట్లు ప్రజల ప్రాణాలు పోయే వరకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తారో లేక స్తంభాలు మార్చి సమస్యను పరిష్కరిస్తారో వేచి చూద్దాం.

– జూపాడుబంగ్లా



80బన్నూరు గ్రామంలో ఓ వీధిలో కడ్డీల సాయంతో ఉన్న విద్యుత్‌స్తంభం



బొద్రాయి సందులో శిథిలమైన విద్యుత్‌స్తంభం

కుటుంబ సభ్యుల చెంతకు తల్లీకూతుళ్లు



పావని, ఆమె కూతుళ్లను ప్రమీలమ్మకు అప్పగిస్తున్న సీఐ రాము

ఆత్మకూరురూరల్: ఈనెల 10న తప్పిపోయిన తల్లీకూతుళ్లను పోలీసులు బుధవారం కుటుంబ సభ్యుల చెంతకు చేర్చారు. ఈ సందర్భంగా అర్బన్ సీఐ రాము మాట్లాడుతూ ఆత్మకూరు పట్టణంలోని పోస్టాఫీసు సమీపంలో వినోద్‌కుమార్, పావని దంపతులు నివసిస్తున్నారన్నారు. భర్త మద్యానికి బానిసై కుటుంబ బాధ్యతలు పట్టించుకోకపోవడంతో పావని తన ఇద్దరు కూతుళ్లు లిఖిత, ప్రణవిలతో కలిసి ఆత్మహత్య చేసుకుందామని ఇంటి నుంచి వెళ్లిపోయిందన్నారు. పావని తల్లి ప్రమీలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా నెల్లూరులో ఉన్నట్లు గుర్తించి తమ సిబ్బందిని పంపి తల్లీబిడ్డలను కాపాడి కుటుంబ సభ్యులకు అప్పగించామన్నారు.

ఖర్చులు తగ్గించుకుని ఆదాయం పెంచుకోవాలి



నందిపల్లెలో మాట్లాడుతున్న ఏడీఏ చెన్నయ్య

మహానంది: వ్యవసాయంలో ఖర్చులు తగ్గించుకుని ఆదాయం పెంచుకోవాలని జిల్లా వనరుల కేంద్రం అసిస్టెంట్ డైరెక్టర్ చెన్నయ్య రైతులకు సూచించారు. బొల్లవరం, నందిపల్లె గ్రామాల్లో బుధవారం రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఏడీఏ చెన్నయ్య మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలన్నారు. తద్వారా మానవాళి ఆరోగ్యాన్ని, పర్యావరణాన్ని కాపాడుకోవచ్చన్నారు. వీటితో పాటు ప్రకృతి, సేంద్రియ పద్ధతుల ద్వారా పండించిన పంట దిగుబడులకు మార్కెట్‌లో మంచి ఆదరణ ఉందన్నారు. భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా ఎరువులు వాడితే ఖర్చులు తగ్గుతాయన్నారు. ఏఓ నాగేశ్వరరెడ్డి, ఆత్మ ప్రాజెక్ట్ బీటీఎం ఉమ, వీఏఏ మంజుల పాల్గొన్నారు.

- **నందికొట్కూరు:** మండల పరిధిలోని బిజినవేముల, కొణిదేల, నాగటూరు గ్రామాల పొలిమేరలో రైతులకు పొలంబడి, పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించి వ్యవసాయ సహాయ సంచాలకులు గిరీష్ పలు సూచనలు ఇచ్చారు.
- **వెలుగోడు:** వేల్పనూరు, రేగడగూడూరు గ్రామాల్లో మండల వ్యవసాయ అధికారిణి స్వాతి పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మొక్కజొన్న పంటలలో యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు.
- **జూపాడుబంగ్లా:** వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు పాటించి తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలని నందికొట్కూరు ఏడీఏ గిరీశ్, ఏఓ కృష్ణారెడ్డి సూచించారు. బుధవారం తరిగోపుల, పి.లింగాపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి రైతులకు పలు సూచనలు ఇచ్చారు.
- **కొత్తపల్లి:** మండల పరిధిలోని గోకవరం, ఎదురుపాడు గ్రామాల పంటపొలాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి అమీరున్నిసా బేగం పాల్గొని రైతులకు పలు సలహాలు ఇచ్చారు.

సొసైటీలకు పాలకవర్గ కమిటీ నియామకం జరిగేనా?

జూపాడుబంగ్లా: ఉమ్మడి కర్నూలు జిల్లాల్లోని సహకార సొసైటీలకు చాలా వరకు పాలకవర్గ కమిటీలను నియమించారు. నందికొట్కూరు నియోజకవర్గంలోని 80బన్నూరు, బ్రాహ్మణకొట్కూరు సొసైటీలకు మాత్రం పాలకవర్గ కమిటీలను నియమించకపోవటంతో సభ్యత్వం ఉన్న రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనందున రైతులకు అవసరమైన పెట్టుబడుల కోసం సొసైటీల్లో తక్కువ వడ్డీకి ఖరీఫ్ పంట రుణాలు, పొలాల మార్ట్‌గేజ్ రుణాలు పొందే అవకాశం ఉంటుంది. ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు పొందవచ్చునని సొసైటీల్లో సభ్యత్వం ఉన్న రైతులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం జూపాడుబంగ్లా, బ్రాహ్మణకొట్కూరు సొసైటీలు ప్రత్యేక అధికారుల అజమాయిషీలో కొనసాగుతున్నాయి. రైతుల సంక్షేమార్థం సత్వరమే పాలక కమిటీలను నియమించి ఖరీఫ్ పంటల రుణాలు అందేలా చేయాలని రైతులు కోరుతున్నారు.

పంటను ధ్వంసం చేసిన అడవిపందులు

కొత్తపల్లి: మండల పరిధిలోని పెద్దగుమ్మడాపురం గ్రామానికి చెందిన రైతు నాగేషన్న యాదవ్ సాగు చేసిన మొక్కజొన్న పంటను అడవి పందులు ధ్వంసం చేశాయి.

ఇంతకు ముందే ఒకసారి పంటను ధ్వంసం చేయగా చెరిపి మొక్క జొన్న వేశానని, పైరు ఏపుగా పెరుగుతున్న సమయంలో మరోసారి అడవి పందుల గుంపు ధ్వంసం చేసిందని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. పరిహారం అందించి ఆదుకోవాలని రైతు కోరారు.



ధ్వంసం అయిన మొక్కజొన్న పంటను చూపుతున్న రైతు

సబ్‌చానల్ కాల్వలకు నీటిసరఫరా

జూపాడుబంగ్లా: లాకిన్స్‌లా నుంచి నిప్పుల వాగు, తూడిచెర్ల సబ్‌చానల్ కాల్వలకు సాగు నీటి సరఫరా చేస్తున్నట్లు ఏఈ శ్రీనివాసనాయక్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ సుంకేసుల డ్యాం నుంచి కేసీ కాల్వకు 2,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. రైతుల వినియోగార్థం లాకిన్స్‌లా వరకు 1,100 క్యూసెక్కుల నీరు వచ్చిచేరుతున్నట్లు తెలిపారు. ఈ నీటిని నిప్పులవాగుకు 500, తూడిచెర్ల సబ్‌చానల్ కాల్వకు 600 క్యూసెక్కుల చొప్పున విడుదల చేస్తున్నట్లు తెలిపారు. రైతులు నీటిని వృథా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కొనసాగుతున్న మున్సిపల్ కార్మికుల దీక్షలు

ఆత్మకూరు: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ కార్మికులు చేపట్టిన రిలే నిరాహారదీక్షలు బుధవారం కొనసాగాయి. మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు నాగన్న, పెద్ద నాగరాజు మాట్లాడుతూ కొన్ని రోజులుగా దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం తగదన్నారు. డిమాండ్లను పరిష్కరించేంతవరకు దీక్షలు కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు చిన్ననాగరాజు, నబి, తిమ్మయ్య, నాగన్న, మోహన్, రవి, సువర్ణమ్మ, జీవరత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

లంపీ స్కిన్ వ్యాధికి టీకాలు

బండి ఆత్మకూరు: మండలంలోని ఏ.కోడూరు, బి.కోడూరు, కడమల కాలువ, సోమయాజులపల్లి, సంతజూటూరు, పరమటూరు గ్రామాల్లో వెటర్నరీ డాక్టర్లు అనూష, జ్యోత్స్నదేవి ఆధ్వర్యంలో బుధవారం పశువులకు లంపీ స్కిన్ వ్యాధి టీకాలు వేశారు. కార్యక్రమాన్ని వెలుగోడు సహాయ సంచాలకులు డాక్టర్ వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు.

వీబీఆర్‌లో 12 టీఎంసీల నీరు

వెలుగోడు: తెలుగుగంగలో అంతర్భాగమైన వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో 12.718 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఏఈ శివనాయక్‌తెలిపారు. బుధవారం బానకచెర్ల లింక్ చానల్ నుంచి వీబీఆర్‌కు 13,500 క్యూసెక్కుల నీరు వచ్చి చేరినట్లు తెలిపారు. వీబీఆర్ నుంచి మద్రాస్ కాల్వకు 2,100 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు చెప్పారు. నంద్యాల, ఆత్మకూరు, వెలుగోడు పట్టణాల్లో తాగునీటి సరఫరా కోసం 20 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నట్లు ఏఈ వివరించారు.

19న విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

వెలుగోడు: విద్యుత్ వినియోగదారుల సమస్యలు తెలుసుకోవడానికి ఈనెల 19న నంద్యాలలో ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఏఈ రవీంద్రనాయక్ బుధవారం తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మధ్యవర్తిత్వంతో కేసుల పరిష్కారం



ర్యాలీలో పాల్గొన్న జూనియర్ సివిల్ జడ్జి రాహుల్ అంబేడ్కర్

ఆత్మకూరురూరల్: మధ్యవర్తిత్వంతో కక్షిదారులు కేసులను పరిష్కారం చేసుకోవడం వల్ల సమయము, వ్యయము ఆదా అవుతుందని ఆత్మకూరు జూనియర్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ రాహుల్ అంబేడ్కర్ సూచించారు. బుధవారం మండల న్యాయ విజ్ఞాన సేవా సమితి ఆధ్వర్యంలో చేపట్టిన అవగాహన ర్యాలీని ఆయన ఆర్టీసీ బస్టాండ్ వద్ద ప్రారంభిం మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న కాంపౌండబుల్ సివిల్, క్రిమినల్ కేసులలో కక్షిదారులు కోర్టు ఆవరణలో స్నేహపూర్వ వాతావరణంలో మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు. పరిష్కరించిన కేసులకు అన్నిరకాల చట్టబద్ధత ఉంటుందన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు మాణిక్యరావు, నగేష్, లక్ష్మీ నారాయణ, రామక్రిష్ణుడు తదితరులు పాల్గొన్నారు.

'మధ్యవర్తిత్వాన్ని' సద్వినియోగం చేసుకోండి



ర్యాలీలో పాల్గొన్న జడ్జి, కమిషనర్, న్యాయవాదులు

నందికొట్కూరు: మధ్యవర్తిత్వం కార్యక్రమాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి, న్యాయ మండల సేవా సంఘం అధ్యక్షులు ఎ.శోభారాణి సూచించారు. బుధవారం కోర్టు ఆవరణం నుంచి పటేల్ సెంటర్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మధ్యవర్తిత్వం ద్వారా ఎలాంటి ఖర్చు లేకుండా సమయం వృథాకాకుండా కేసులు పరిష్కరించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బేబి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు శరబయ్య తదితరులు పాల్గొన్నారు.

బంగారు కుటుంబాలకు చేయూతనివ్వండి



మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి జాకీర్ హుసేన్

నందికొట్కూరు: బంగారు కుటుంబాల అభివృద్ధికి మండల, గ్రామ స్థాయి అధికారులు చేయూత ఇవ్వాలని మండల ప్రత్యేక అధికారి జాకీర్ హుసేన్ సూచించారు. బుధవారం మిడుతూరు మండల పరిషత్ కార్యాలయంలో ఆయా శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపీడీఓ దశరథరామయ్య పాల్గొన్నారు.

- **జూపాడుబంగ్లా:** బంగారు కుటుంబాలను దత్తతకు తీసుకొని వారిని అభివృద్ధిబాటలో నడిపించాలని డీఎల్‌డీఓ శివారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పీ4 సర్వే పూర్తైనందున మండలంలోని 1,130 బంగారు కుటుంబాలను ఒక్కో మండలస్థాయి అధికారి మూడు కుటుంబాల చొప్పున దత్తతకు తీసుకొని పథకాలు అందేలా చూడాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ గోపికృష్ణ పాల్గొన్నారు.

ఎత్తిపోతల పథకాల మరమ్మతులకు ప్రతిపాదనలు

కొత్తపల్లి: మండల పరిధిలోని ముసలిమడుగు గ్రామ శివారులోని శివపురం, సంగమేశ్వరం ఎత్తిపోతల పథకాల మరమ్మతులకు ప్రతిపాదనలు పంపినట్లు ఎత్తిపోతల పథకాల డీఈ నాగర్జునరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శివపురం ఎత్తిపోతలకు రూ.5 కోట్లు, సంగమేశ్వరం ఎత్తిపోతల ఫేస్–1, ఫేస్–2లకు రూ.6.20 కోట్లతో ప్రతిపాదనలు పంపామని వెల్లడించారు.

సమస్యలపై గ్రామస్తుల నిలదీత

పగిడ్యాల: సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని నెహ్రూనగర్‌కు వెళ్లిన నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్యను సమస్యలపై గ్రామస్తులు నిలదీశారు. పైప్‌లైన్ అస్తవ్యస్తంగా ఉండటంతో తాగునీరు సక్రమంగా రావడం లేదని ప్రజలు ఏకరువు పెట్టడంతో ఎమ్మెల్యే వెంటనే ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివకుమార్, ఎంపీడీఓ సుమిత్రమ్మలను పిలిచి సమస్యపై ఆరా తీశారు. వెంటనే పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివరాముడు ఉన్నారు.

కోలుకోలేక విద్యార్థి మృతి



వరణ్‌తేజ(ఫైల్)

కొత్తపల్లి: పాఠశాల వద్ద తోటి విద్యార్థులతో ఆడుకుంటూ కిందపడి చికిత్స పొందుతున్న విద్యార్థి కోలుకోలేక మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. ఎదురుపాడు గ్రామానికి చెందిన పైగిడిమాను రాజు, రేణుకమ్మ కుమారుడు వరణ్‌తేజ(8) గ్రామంలోని ఎంపీయూపీ పాఠశాలలో 3వ తరగతి చదువుతున్నాడు. ఈనెల 11న పాఠశాలకు తోటి విద్యార్థులతో కలిసి వెళ్తూ ఆడుకుంటూ దారిలో కింద పడ్డాడు. మరుసటిరోజు భుజం నొప్పి అని చెప్పడంతో తల్లిదండ్రులు ఆత్మకూరులోని ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స చేయించి నాటు వైద్యుడి వద్ద భుజానికి కట్టు కట్టించారు. బుధవారం ఉదయం మరోసారి అస్వస్థతకు గురికావడంతో నందికొట్కూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడి వైద్యుల సలహా మేరకు కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అయినా కోలుకోలేక మృతి చెందాడు.

సిద్ధాపురం చెరువుకు నీళ్లొచ్చేనా?

- సాగునీటి విడుదల కోసం ఎదురుచూస్తున్న అన్నదాతలు
- పట్టించుకోని అధికారులు



సిద్ధాపురం చెరువు

ఆత్మకూరు: సిద్ధాపురం ఎత్తిపోతల పథకం నుంచి సిద్ధాపురం చెరువుకు సాగునీరు ఎప్పుడెప్పుడు విడుదల చేస్తారా అని అన్నదాతలు ఎదురు చూస్తున్నారు. వెలుగోడు రిజర్వాయర్ నుంచి కృష్ణా జలాలను రెండు రోజుల క్రితం అధికారులు, ప్రజాప్రతినిధులు విడుదల చేశారు. సిద్ధాపురం చెరువుకు కూడా నీటిని విడుదల చేస్తే రైతులు విస్తారంగా వరి సాగు చేసుకోవడంతోపాటు మెట్ట భూముల్లో సాగుచేసిన మొక్కజొన్న, సోయాబీన్‌లాంటి పంటలను కాపాడుకునే అవకాశం ఉంది.

సాగుకు సిద్ధంగా 12 వేల ఎకరాల మాగాణి

సిద్ధాపురం చెరువు కింద 12 వేల ఎకరాల్లో రైతులు వరి పంట సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు. చెరువు కింద సిద్ధాపురం, పెద్దనంతపురం, సిద్ధపల్లి, బాపనంతపురం, వెంకటాపురం, ఎస్‌ఎన్ తండా, కృష్ణాపురం, అమలాపురం, ఆత్మకూరు, నల్లకాల్వ గ్రామాల్లో దాదాపు వేల ఎకరాల్లో వరి సాకు కోసం ఎదురు చూస్తున్నారు.

కరివేన చెరువు కింద..

సిద్ధాపురం చెరువుకు వచ్చే కృష్ణా జలాలు వివిధ గ్రామాల మీదుగా పంట పొలాల్లో ప్రవహిస్తూ కాల్వల ద్వారా కరివేన చెరువుకు చేరుకుంటాయి. ఈ చెరువు కింద కూడా 12 వందల ఎకరాల్లో వరి, మొక్కజొన్న పంటలు రైతులు పండించుకుంటారు. ఈ ఎత్తిపోతల పథకం నీరు రాకపోతే మెట్టభూములు కావడంతో పంటలు పండే అవకాశం లేదు. అలాగే బాపనంతపురం గ్రామానికి సిద్ధాపురం చెరువు నుంచి సాగునీరు అందితే దాదాపు 400 ఎకరాలకు పైగా వరి, మొక్కజొన్న పంటలు పండే అవకాశం ఉంది.

నారుమడులకు నీరు లేదు..

దాదాపు పది గ్రామాలకు పైగా రైతులు నారుమడులను వేసుకునేందుకు సిద్ధంగా ఉన్నా నీరు లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే పంట పొలాల్లో దుక్కులు దున్నడమేగాకుండా అక్కడక్కడా మొక్కజొన్న, పత్తి, సోయాబీన్ పంటలను వేశారు. సిద్ధాపురం చెరువు నీటి సామర్థ్యం 20 అడుగుల చొప్పున అర టీఎంసీ నీటి సామర్థ్యం కలిగి ఉంది. ప్రస్తుతం చెరువులో పది అడుగుల మేర నీరు వచ్చినా వర్షాకాలం అనుకోకుండా నల్లమలలో భారీ వర్షాలు కురిసినా చెరువులోకి నీరు వచ్చే అవకాశం ఉంది. ఈ నీటితో కనీసం చెరువు పూర్తి స్థాయిలో నీటి సామర్థ్యం కలిగి ఉంటుంది. దీంతో రైతులు వేలాది ఎకరాల్లో వరి పంటను సాగు చేసుకునే అవకాశం ఉంటుంది.

సిద్ధాపురం చెరువుకు నీరు విడుదల చేయాలి



సిద్ధాపురం చెరువుకు సాగునీటిని విడుదల చేయాలి. చెరువులో మూడు అడుగుల కంటే నీరు ఎక్కువగా లేదు. కనీసం పది అడుగుల నీటిని ఎత్తిపోతల పథకం నుంచి విడుదల చేస్తే మాలాంటి రైతులు చెరువు కింద వరి పంటలు వేసుకునేందుకు అవకాశం ఉంటుంది.

– వెంకటేశ్వరనాయక్, రైతు, ఎస్ఎన్ తండా

నారు మడులు వేసేందుకు సిద్ధమవుతున్నాం



సిద్ధాపురం చెరువుకు ఎత్తిపోతల పథకం నుంచి నీరు వస్తే నారుమడులు వేసుకుంటాం. ఇప్పటికే పొలాలను దుక్కిదున్నాం. నీరు వస్తే వరి పంటలు వేసుకునే అవకాశం ఉంది. అలాగే రెండో పంట వేసుకునే అవకాశం కూడా ఉంటుంది. అధికారులు ఎత్తిపోతల నుంచి సాగునీరు విడుదల చేయాలి.

– అశోక్, రైతు, ఆత్మకూరు

దుకాణాల అద్దె తగ్గించాలి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం పరిధిలోని లలితాంబా వాణిజ్య సముదాయంలో దుకాణాలకు అద్దె తగ్గించి, 11 ఏళ్ల కాలపరిమితితో ఇవ్వాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అరవింద్‌రెడ్డి బుధవారం ఈఓ ఎం.శ్రీనివాసరావును కలిసి వినతి పత్రం అందించారు.

బీఎల్‌ఓలకు శిక్షణ

కొత్తపల్లి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో బుధవారం తహసీల్దార్ ఉమారాణి ఆధ్వర్యంలో బూత్‌లెవల్ అధికారులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో నందికొట్కూరు ఎలక్షన్ డీటీ మధు సుధాకర్, సీనియర్ అసిస్టెంట్ కళావతి, కొత్తపల్లి డిప్యూటీ తహసీల్దార్ అరుణ పాల్గొన్నారు.

సిద్ధేశ్వరం అలుగు నిర్మాణం చేపట్టాలి

నందికొట్కూరు: రెండు తెలుగు రాష్ట్రాల మధ్య సంగమేశ్వర పుణ్యక్షేత్రం వద్ద సిద్ధేశ్వరం అలుగు నిర్మాణం చేపట్టాలని సీపీఐ(ఎంఎల్) జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సిద్ధేశ్వరం వద్ద అలుగు నిర్మాణం పూర్తయితే రాయలసీమ సస్యశ్యామలం అవుతుందన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు ఏసన్న, బీబీ, లక్ష్మిదేవి తదితరులు పాల్గొన్నారు.